
నిజం గెలిచింది



తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు అండ్‌కో కుట్రలను చిత్తు చేస్తూ సుప్రీంకోర్టు స్వతంత్ర సిట్ ఏర్పాటుకు ఆదేశించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సుప్రీం ఆదేశాలు కూటమి పాలకులకు చెంపపెట్టు వంటివన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. - సాక్షి నెట్‌వర్క్

తప్పుడు ప్రచారం



లడ్డూలో కల్తీ నెయ్యి వాడకుండానే ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుడు ప్రచారం చేశారు. తాజాగా సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మతం పేరుతో ఆడుతున్న నాటకాన్ని కోర్టు బయటపడింది. ప్రజలందరూ గమనిస్తున్నారు.

– తామరౌల్లి ఫ్రాన్సిస్, లొద్దబద్ర, పలాస మండలం

చంద్రబాబుకు భంగపాటు



ఎన్నికల హామీల నుంచి తప్పించుకోవడానికి సీఎం చంద్రబాబు లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారు. ఇప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో చంద్రబాబుకు భంగపాటు జరిగింది. ఇప్పటికైనా కూటమి కుట్రలను భక్తులు గుర్తించాలి.

– ఎస్.ఉషారాణి, సమరసత సేవా ఫౌండేషన్ మహిళా ప్రతినిధి, టెక్కలి

దేవుడితో రాజకీయాలా?



కల్తీ లడ్డూ వ్యవహారంపై సీఎం చంద్రబాబు చేసిన దుష్ప్రచారాలపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం. అలవికాని హామీలతో ప్రజల్ని మోసం చేసి సీఎం పదవిని చంద్రబాబు దక్కించుకున్నా రు. ఇప్పటికైనా చంద్రబాబు దేవుడితో రాజకీయాలు మానుకోవాలి.

– ఎస్.శ్రీరామ్మూర్తి, ఎంపీపీ, నందిగాం

దుష్ప్రచారం తగదు



పవిత్రమైన లడ్డూ ప్రసాదంపై ఎలాంటి ఆధారాలు లేకుండా కల్తీ ప్రచారం చేసి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు భక్తుల మనోభావాలు దెబ్బ తీశారు. ఎన్నికల హామీలను అమలు చేయలేక వారిని పక్కదారి పట్టించేందుకు చేస్తున్న పని ఇది.

– పిలక రాజలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం

కనువిప్పు కావాలి



తిరుపతి లడ్డూ వ్యవహారంలో సీఎం చంద్రబాబు వైఖరిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కనువిప్పు కావాలి. కోట్లాది మంది భక్తుల మనోభావాలను నష్టపరిచే విధంగా ఇటువంటి దుష్ప్రచారాలు చేయడం మంచిది కాదు. సుప్రీం కోర్టు నిర్ణయం అన్ని వర్గాలకు హర్షణీయం.

-ఎస్.మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెక్కలి

అధికారులకు బదిలీలు ▶ సామాన్యులకు అవస్థలు

- విధుల్లో చేరకపోవడంతో ధ్రువపత్రాల జారీలో జాప్యం
- ఆందోళనలో పోటీ పరీక్షల అభ్యర్థులు
- కార్యాలయాల చుట్టూ తప్పని ప్రదక్షిణలు

వజ్రపుకొత్తూరు రూరల్:

కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగుల బదిలీలతో అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు. మండల స్థాయి అధికారులతో పాటు సిబ్బందిని సైతం బదిలీలు చేయడంతో వారి స్థానంలో ఆయా అధికారులు కొంతమంది విధుల్లో చేరలేదు. దీంతో మండల కార్యాలయాలకు వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చే అభ్యర్థులకు అవస్థలు తప్పడం లేదు.గతంలో వజ్రపుకొత్తూరు రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వర్తించిన తహసీల్దార్ బి.బాల బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కొత్తగా వచ్చిన తహశీల్దార్ ఇంకా విధుల్లోకి చేరలేదు. ఉప తహశీల్దార్‌గా పనిచేసి బదిలీ అయిన వి.గిరిరాజ్ స్థానంలో విధుల్లో చేరిన మురళికి ఇంకా ఎఫ్ఏసీ ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా అగ్నివీర్ అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరేందుకు అవసరమైన ధ్రువపత్రాల కోసం మండల కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు సమయం లేదని, ఇక్కడ చూస్తే అధికారులు ఉండటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా పనిజరగకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



వజ్రపుకొత్తూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న అభ్యర్థులు

సమయం లేదు..



నేను అగ్నివీర్‌కు ఎంపికయ్యాను. కొన్ని రకాలు ధ్రువీకరణ పత్రాలు అవసరం. మండల కార్యాలయానికి వస్తే తహశీల్దార్ లేరు. కొత్త ఆఫీసర్ జాయిన్ కాలేదని సిబ్బంది చెబుతున్నారు. నాకు సమయం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– కె.యువరాజు, వజ్రపుకొత్తూరు మండలం

చాలా దూరం నుంచి వచ్చా..



మండల కేంద్రానికి శివారు ప్రాంతమైన మారుమూల గ్రామం మాది. అక్కడ నుంచి మండల కేంద్రానికి వచ్చాను. అగ్నివీర్‌కు ఎంపిక కావడంతో పలు రకాలు సర్టిఫికెట్లు అవసరమయ్యాయి. మండల కేంద్రానికి పలుమార్లు వచ్చినా అధికారులు కనిపించడం లేదు.

– కె.హేమసుందరరావు, అనకాపల్లి

అనధికారికంగా పూండి మార్కెట్ ఆశీల వసూలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి- గోవిందపురం వారపు సంత, స్థానిక మార్కెట్ రోజు వారీ ఆశీల వసూళ్లను పంచాయతీ కార్యదర్శి అనధికార వ్యక్తులతో చేయిస్తుండటంపై ఎంపీడీఓ, డీఎల్‌పీఓ, డీపీఓ, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ పాలిన రమ్య శుక్రవారం తెలిపారు. నాలుగు నెలలుగా వేలం పాట నిర్వహించకుండా పంచాయతీ కార్యదర్శి టీడీపీ నేతలకు అవకాశం ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను తీర్మానం ఇచ్చినా వేలం పాట నిర్వహించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్చిలో వేలం నిర్వహించి ఏప్రిల్ 1 నుంచి మార్కెట్ కాంట్రాక్ట్ దక్కించుకున్నవారు వసూలు చేపట్టి పంచాయతీకి చెల్లించాల్సి ఉంటుందని, పంచాయతీ కార్యదర్శి ఆ విధంగా చేయకుండా అనధికార వ్యక్తులకు ఆశీలు వసూళ్ల అవకాశం ఇచ్చి ఆ సొమ్మును పంచాయతీకి చెల్లించడం లేదని పేర్కొన్నారు. తక్షణమే వేలం నిర్వహించాలని కోరారు. ఈ విషయమై కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ వారంలోగా వేలం నిర్వహించి, వసూలు చేసిన ఆశీలు పంచాయతీకి చెల్లిస్తామని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇచ్ఛాపురం విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్, స్థానికులు

ఇచ్ఛాపురం: చిత్తూరు జిల్లా తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఇచ్ఛాపురం పట్టణానికి అశిరెవంత్‌రెడ్డి, నీలాపు భగవాన్, తిప్పన జీవన్, చాట్ల గిరి ఎంపికైనట్లు కోచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. వీరికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం డాక్టర్ ప్రతిభాప్రియ, ఢిల్లేశ్వరరావులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో విజయ్ భాస్కర్, కృష్ణయ్య, సూరిబాబు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక సీబీఎస్‌సీ జ్ఞాన భారతి పాఠశాలకు చెందిన పాలేపు జగదీష్(యోగా పోటీలకు), అఖిల్‌యాదవ్(డిస్కస్‌త్రో), లతాశ్రీ(100మీ, హర్డిల్స్) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కార్యదర్శి జోహార్‌ఖాన్ తెలిపారు.

రైలు నిలయం అభివృద్ధి చేయాలి

ఇచ్ఛాపురం/సోంపేట: ఇచ్ఛాపురం రైలు నిలయంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలని జెడ్ఆర్‌యూసీసీ ఈస్ట్‌కోస్ట్ రైల్వే సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం భువనేశ్వర్ జరిగిన ఖుర్దా డివిజనల్ సమావేశంలో స్థానిక సమస్యలపై చర్చించారు. బారువ రైల్వేస్టేషన్‌లో రైళ్లు నిలుపుదల చేయాలని బారువ రైల్వేస్టేషన్ యూజర్ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఉచిత పాస్‌పోర్ట్ మేళా



ఎంఓయూ పత్రాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

టెక్కలి : టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉచిత పాస్‌పోర్ట్ మేళా నిర్వహించారు. లండన్‌కు చెందిన లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాలో భాగంగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థతో ఆదిత్య కళాశాల ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ సందర్భంగా లియో గ్లోబల్ సంస్థ అడ్మిషన్ మేనేజర్ వాసవి కోన మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులకు అంతర్జాతీయంగా విద్యా సదుపాయాలపై సేవలు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, చీఫ్ డెవలప్‌మెంట్ బిజినెస్ డైరెక్టర్ సతీష్, మేనేజర్ కె.రాజేంద్ర, డీన్‌లు వై.యుగంధర్, కె.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షిద్దాం

టెక్కలి: వన్యప్రాణుల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని టెక్కలి అటవీ శాఖాధికారి జి.జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం టెక్కలి మండలం తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. వన్య ప్రాణులను వేటాడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీసిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఔదార్యం



సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సంతబొమ్మాళి: మండలంలోని బడేకుప్పన్నపేటకు చెందిన కె.పి.స్పందన ఫౌండేషన్ సభ్యులు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సహాయం అందజేశారు. కోటబొమ్మాళి మండలం సరియాబొడ్డపాడుకు చెందిన రోణంకి యుగంధర్ ఫైలేరియా కారణంగా కుడి కాలు వాచిపోయింది. ఆరు ప్లాస్టిక్ సర్జరీలు అవసరమని వైద్యులు చెప్పగా రెండు నెలలుగా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు షణ్ముఖరావు మాస్టర్ రూ.10వేలు ఆర్థిక సహాయం శుక్రవారం అందించారు.

కళాపోషణకు పుట్టినిల్లు ఉద్దానం



మావుడూరి సూర్యప్రసాద్‌ను సత్కరించిన పిరియా విజయ, నర్తు రామారావు

కవిటి: సంగీత, సాహిత్య కళా సంప్రదాయాల పోషణకు పుట్టినిల్లుగా కవిటి ఉద్దానం నిలుస్తుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఉద్దానం కేంద్రంగా నిర్వహిస్తున్న శ్రీమహతి సాంస్కృతిక సంగీత సమాఖ్య, స్థానిక కనకదుర్గాపూజా కమిటీ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా రేడియో ఏ-గ్రేడ్ ఆర్టిస్ట్ మావుడూరి సూర్యప్రసాద్ (మృదంగకళాకారుడు)ను దుశ్శాలువతో శుక్రవారం సత్కరించి ఘనంగా సన్మానించారు. అంతకుముందు దుర్గాశరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మావుడూరి సూర్యప్రసాద్ మృదంగం కచేరీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కడియాల ప్రకాష్, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పాండవ, తిప్పన ధనుంజయ రెడ్డి, సీహెచ్ వినోద్, కనకదుర్గ ఆలయ కమిటీ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఫిర్యాదు

టెక్కలి: మండలంలోని వేములవాడలో వైఎస్సార్ సీపీ కార్యకర్త పోలాకి చంద్రశేఖర్‌కు చెందిన మామిడి మొక్కలు నరికివేయడంతో పాటు గ్రామంలో మంచినీటి సరఫరా మోటారు విద్యుత్ వైర్లు తొలగింపు ఘటన నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పైల సోమేశ్వరరావు ఇటీవల టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పోరంబోకు స్థలంలో చెత్త సేకరణ కేంద్రాన్ని నిర్మాణం చేసి అందులో పశువులు కడుతున్నారని, మంచినీటి సరఫరా విద్యుత్ మోటారు వైర్లను చంద్రశేఖర్ తొలగించి తమపై నింద వేసి గ్రామంలో దుష్ప్రచారం చేస్తున్నారని, తన సోదరుడు హేమసుందర్‌పై తప్పుడు ఫిర్యాదు చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపాల్, కంపెనీ ప్రతినిధులు

సోంపేట: ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బారువ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు అన్నారు. బారువ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పది ప్రైవేటు కంపెనీల ఆధ్వర్యంలో యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 250 మంది హాజరు కాగా 104 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పండి రామకృష్ణ, జేకేసీ కో-ఆర్డినేటర్ బి.రాంబాబు, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు ఎనిమిది వినతులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పట్టణ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (మీకోసం) కార్యక్రమం నిర్వహించారు. మొత్తం ఎనిమిది వినతులు రాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం దిశగా ప్రయత్నించారు. అనంతరం పాతపట్నం సీఐగా బాధ్యతలు స్వీకరించిన వి.రామారావు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

కరెంట్ లేక రోగుల ఇక్కట్లు

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో కరెంట్ లేక రోగులు ఇబ్బందులు పడ్డారు. శనివారం జిల్లా ఆసుపత్రి లైన్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖాధికారులు ముందుగానే సమాచారం తెలియజేసినా ఆస్పత్రి సిబ్బంది సకాలంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలు ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరయ్యారు. జనరేటర్ వేయకపోవడంతో రోగులు, బంధువులు ఆస్పత్రి సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావును నిలదీశారు. దీంతో డీజిల్ తెప్పించి జనరేటర్ వేయడంతో రోగులకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది.

కంచిలి తహశీల్దార్‌గా రమేష్‌కుమార్



రమేష్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న డీలర్లు

కంచిలి: మండల తహశీల్దార్‌గా నిడగంటి రమేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పొందూరు తహశీల్దార్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన తహశీల్దార్ వై.జయలక్ష్మి పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌ను డీలర్ల సంఘం అధ్యక్షుడు కొత్తకోట నాగరాజు, పి.ప్రసాద్, పిసి పండా, నాగేశ్వరరావు, తిరుపతిరావు, రమేష్, బాబూరావు, భాస్కరరావు, మన్మథరావు, ప్రదీప్, వెంకటరావు, శివ, పితంబర్ అభినందనలు తెలిపారు.

పలాస: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వసంత్‌కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీఓ గా పనిచేసిన ఎస్.రమేష్‌నాయుడు వజ్రపుకొత్తూరు మండలానికి బదిలీపై వెళ్లారు. అతని స్థానంలో కాకినాడ జిల్లాలో పనిచేసిన వసంతకుమార్ పలాసకు రానున్నారని పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు చెప్పారు.

కాశీబుగ్గ: పలాస తహశీల్దారుగా పనిచేసిన బి.సత్యంను శుక్రవారం ఘనంగా సత్కరించారు. పలాస రెవెన్యూ డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలకుమారీ పూజలు

టెక్కలి రూరల్: దేవినవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందిగాం మండల కేంద్రంలోని పాతపట్నం అమ్మవారి దేవాలయంలో శుక్రవారం బాలకుమారీ పూజలు నిర్వహించారు. 9 మంది చిన్నారులను అమ్మవార్లుగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మేడేపల్లి రమేష్ శర్మ, బోసుబాబు పాల్గొన్నారు.

బ్రహ్మచారిణిగా స్వేచ్ఛావతి అమ్మవారు

ఇచ్ఛాపురం: గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు.



పూజలందుకుంటున్న అమ్మవారు



అమ్మవారి ఆలయం వద్ద చిన్నారులు

కొత్తమ్మతల్లి జాతర విజయవంతం

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి జాతరకు అన్నివిధాలా సహకరించి విజయవంతం చేసిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, ప్రభుత్వ, పోలీసు అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్ఛాపురం రూరల్: విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో డొంకూరు, బూర్జపాడు, సన్యాసిపుట్టుగ గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నామని ఈఈ జి.ప్రసాదరావు తెలిపారు.

గ్రామసభతో చట్టబద్ధత

ఇచ్ఛాపురం రూరల్: రాజ్యాంగంలో ఆర్టికల్ 243(ఎ) ప్రకారం రాష్ట్ర శాసనసభల ద్వారా కొన్ని చట్టబద్ధమైన అధికారాలు, విధులను గ్రామ సభలకు కల్పించడం సంతోషదాయకమని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం టి.బరంపురంలో గ్రామ సభ నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో ఏపీఓ పి.శ్రీనివాసరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్లేట్‌లెట్స్ అందించి.. ప్రాణాలు కాపాడి..

కాశీబుగ్గ: ప్లేట్‌లెట్స్ పడిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళకు స్థానిక యువకుడు ప్లేట్‌లెట్స్ అందించి ప్రాణాలు కాపాడాడు. కాశీబుగ్గ డిగ్రీ కళాశాల రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం నవతరం సేవా సంఘానికి తెలిసింది. వారి అభ్యర్థన మేరకు కాశీబుగ్గకు చెందిన సిద్ధార్థ త్యాడి అనే యువకుడు ఏబీ పాజిటివ్ ప్లేట్‌లెట్స్ అందించి ప్రాణాలు నిలిపారు. ఈ సందర్భంగా యువకుడిని పలువురు అభినందించారు.



ఆపదలో ఆదుకున్న సిద్ధార్థ త్యాడి

పల్లివూరులో రేషన్ డిపో ప్రారంభం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పల్లివూరులో ఏర్పాటు చేసిన నూతన రేషన్ డిపోను శుక్రవారం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సూరాడ మోహన రావు, గోవిందపురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంచమ్మ తల్లిని దర్శించుకున్న జడ్జి కిషోర్‌బాబు



పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న కమిటీ ప్రతినిధులు

కంచిలి: సోంపేట ఆరో అదనపు జిల్లా జడ్జిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కోడూరు కిషోర్‌బాబు శుక్రవారం కంచిలిలోని కంచమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధాశ్రమానికి సరుకుల వితరణ



సరుకులు అందజేసిన ఫౌండేషన్ సభ్యులు

కంచిలి: మండలంలోని మకరం సరియాపల్లి గ్రామానికి చెందిన ఎస్.ఎం.ఎస్.ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండపల్లిలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి శుక్రవారం నిత్యావసర సరకులు వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎస్.ఎం.ఎస్. ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంచిలి ఏపీఎంగా ప్రసాదరావు



ఏపీఎం ప్రసాదరావుకు స్వాగతం చెబుతున్న సిబ్బంది

కంచిలి: మండల మహిళా సమాఖ్య నూతన ఏపీఎంగా సనపల ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు మార్పు లలిత, సభ్యులు, సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు. ఇక్కడ పనిచేసిన ఏపీఎం పి.ఉమారాణి టెక్కలికి బదిలీ అయ్యారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు చిత్రపటం అందజేస్తున్న ఈఓ

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయల విరాళం చెక్కును వరం పవర్‌ప్లాంట్ ప్రతినిధులు బోయిన గోవిందరాజులు, బి.వెంకటనాగేంద్ర ప్రసాద్, బి.సంతోష్‌కుమార్, బి.సత్యశ్రీనివాస్ శుక్రవారం ఆలయ ఈఓ వి.రాధాకృష్ణకు అందజేశారు. ఆ సందర్భంగా దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఈఓ అందజేశారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: మండలంలోని కొజ్జీరియా పంచాయతీలో పారిశుద్ధ్య కార్యక్రమాల కల్పనలోభాగంగా డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్టు సర్పంచ్ ఉప్పాడ నీలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్, ఎంపీటీసీ దశరథరావు, పిట్ట దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

తివాచీ బహూకరణ



ఆలయ కమిటీకి తివాచీని అందిస్తున్న దాత

కంచిలి: స్థానిక కంచమ్మతల్లి అమ్మవారి ఆలయానికి 100 అడుగుల ఎరుపు తివాచీని టిఫిన్ హోటల్ యజమాని గుడియా అర్జున్ శుక్రవారం బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వంకల సోమేష్, జగదీష్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

కాశీబుగ్గ: మొగిలిపాడులో నెయ్యిల దొరబాబు అనే షాపు యజమానిపై అదే గ్రామానికి చెందిన దున్న శంకరరావు పాతకక్షలతో దాడి చేశాడు. దీంతో బాధితుడు కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించగా సీఐ మోహనరావు కేసు నమోదు చేశారు.

చోరీలపై అప్రమత్తం

ఇచ్ఛాపురం: దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మీసాల చిన్నంనాయుడు శుక్రవారం పేర్కొన్నారు. దూరప్రాంతాలకు వెళ్తే విలువైన వస్తువులను లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు.